గోడౌన్ తనిఖీ

తణుకు: ప్రభుత్వం ద్వారా సరఫరా అయ్యే నిత్యవసర వస్తువులు వినియోగదారులకు సకాలంలో అందేలా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం తణుకు పట్టణంలో ఎంఎల్ఎస్ పాయింట్(నిత్యవసర వస్తువుల గోడౌన్)ను జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న సరుకును, స్టాఫ్ రిజిస్టర్‌లను తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్టర్‌లోని నిల్వలకు, భౌతిక నిల్వలకు ప్రతిరోజు లెక్కలు సరి చూసుకోవాలని సూచించారు. ఈనెల 30 లోపు జిల్లాలోని అన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌ల నుంచి ఎఫ్‌పి షాపులకు నిత్యవసర సరుకులు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సకాలంలో జీతాలు వస్తున్నాయా అని హమాలీలను ప్రశ్నించగా, జీతాలు వస్తున్నాయని, ఏవిధమైన ఇబ్బందులు లేవని జాయింట్ కలెక్టర్‌కు వారు తెలిపారు. ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివరాంప్రసాద్, టెక్నికల్ సహాయ మేనేజర్ ఇబ్రహీం, తణుకు తహాశీల్దారు డివిఎస్ఎస్ అశోకవర్మ పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు షురూ..!

గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన మంత్రి మండలి

ఉమ్మడి పశ్చిమలో మేజర్ ఇరిగేషన్‌లో 131 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, 20 డిసిలు, ఒక ప్రాజెక్టు కమిటీ

మైనర్ ఇరిగేషన్‌లో వాటర్ యూజర్స్ అసోసియేషన్లు 222, ప్రాజెక్టు కమిటీలు రెండు

ప్రతి కమిటీలో అధ్యక్ష, ఉపాధ్యక్షులు, నలుగురు సభ్యులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం ఆమోద ముద్రవేసింది. బుధవారం జరిగిన మంత్రి మండలి సమావేశం సాగునీటి సంఘాల ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో రాజకీయ నాయకుల్లో హడావుడి మొదలైంది. సాగునీటి సంఘాల్లో పదవులకు ఎవరిని నియమించాలనే దానిపై ప్రజాప్రతినిధుల్లో చర్చ మొదలైంది. గడిచిన ఐదేళ్లుగా ఎన్నికల నిర్వహణ లేకుండా మగ్గిపోయిన సాగునీటి సంఘాలు ఇక ప్రజాప్రతినిధులతో కళకళలాడనున్నాయి. 2015లో సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. ఐదేళ్లకోసారి జరగాల్సిన ఈ ఎన్నికలు మళ్లీ ఇప్పటి వరకూ జరగలేదు. దీంతో మేజర్, మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించిన ఎన్నో పనులు కుంటుపడిన పరిస్థితి నెలకొంది. సాగునీటి సంఘాలకు మూడు పద్ధతుల్లో ఎన్నికల నిర్వహణ ఉంటుంది. మేజర్, మైనర్ ఇరిగేషన్‌కు విడివిడిగా ఈ ఎన్నికలు నిర్వహిస్తారు. సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియలో వాటర్ యూజర్స్ అసోసియేషన్, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలు మొత్తం మూడు విధాలుగా ఉంటాయి. వాటర్ యూజర్స్ అసోసియేషన్ కమిటీల్లో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, నలుగురు కమిటీ సభ్యులు ఉంటారు. వీరు డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకుంటాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రాతిపదికగా ఈ ఎన్నికలు జరగనున్నాయి. గోదావరి డెల్టా పరిధిలోని మేజర్ ఇరిగేషన్‌లో 131 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, 20 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీ ఉన్నాయి. మైనర్ ఇరిగేషన్ పరిధిలో 222 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, రెండు ప్రాజెక్టు కమిటీలు ఉంటాయి. మైనర్ ఇరిగేషన్‌లో డిస్ట్రిబ్యూటరీ కమిటీలు లేవు. మేజర్ ఇరిగేషన్ అంతా డెల్టా పరిధిలో ఉండగా, మైనర్ ఇరిగేషన్ అంతా మెట్ట ప్రాంతంలో ఉంది. మెట్టప్రాంతంలో తమ్మిలేరు, ఎర్రకాలువకు రెండు ప్రాజెక్టు కమిటీలు ఉంటాయి. సాగునీటి సంఘాల ఎన్నికలపై ప్రభుత్వం జిఒ జారీ చేసిన తర్వాత ప్రక్రియ మొదలుకానుంది. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల ఆధ్వర్యంలో వాటర్ యూజర్స్ కమిటీల ఎన్నికలు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల ఆధ్వర్యంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు, సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు కమిటీల ఎన్నికలు జరగనున్నాయి. కమిటీల్లోని సభ్యుల ఎంపిక ప్రకియ అంతా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరగనుంది. ఎవరికి పదవులు ఇవ్వాలనే దానిపై స్థానికంగా ఎంఎల్‌ఎలు నిర్ణయం తీసుకుని జాబితా తయారు చేసి అధికారులకు పంపించే అవకాశం ఉంది.

ఎన్నికలు లేక పనులన్నీ పడక

సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగకపోవడంతో సాగునీటి వనరుల అభివృద్ధి పనులకు సంబంధించిన పనులు పూర్తిగా పడకేశాయి. కాలువలు, చెరువులకు సంబంధించిన పూడికతీత పనులు, కాలువ గట్లు పటిష్టం చేసే పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. సాగునీటి సంఘాలు నీటితీరువా వసూలు చేసి నీటి వనరుల నిర్వహణకు ఖర్చు చేస్తాయి. కమిటీలు లేకపోవడంతో నీటి తీరువా వసూలు కూడా జరగని పరిస్థితి ఏర్పడింది. కనీసం డ్యామ్ గేట్లకు గ్రీజ్ వంటి పనులు కూడా చేయని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం అధికారికంగా సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోయినా.. అనధికారికంగా వైసిపి నాయకులకు ఈ పదవులు కట్టబెట్టింది. వీరిపై అధికారుల పర్యవేక్షణ అనేది లేకపోవడం గ్రామాల్లో ఇష్టానుసారంగా రైతుల నుంచి సొమ్ము వసూలు చేసి మింగేసిన పరిస్థితి నెలకొంది. కాలువల బాగుజేత పేరుతో ఎకరాకు రూ.వెయ్యి వరకూ వసూలు చేయడం, లెక్కలు చెప్పని పరిస్థితి ఉంది. చేపల చెరువుల యజమానులకు అండగా నిలబడుతూ వ్యవసాయం చేసే రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. సాగునీటి సమస్యలను పట్టించుకోకుండా అవినీతికి ఆలవంగా సాగునీటి సంఘాల పదవులను తయారు చేసిన పరిస్థితి నెలకొంది.

నేతల నిర్బంధం.. ఆపై ఇళ్ల తొలగింపు

ఆకివీడులో అధికారుల హైడ్రామా

సిపిఎం నిరసన

పొక్లెయిన్‌తో ఇళ్లు కూల్చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ఆకివీడు

పట్టణంలోని అయిభీమవరం రోడ్డును ఆనుకుని ఉన్న ఇళ్లను అధికారులు బుధవారం తొలగించారు. ఈ పనులను అడ్డుకుంటారనే పేరుతో బుధవారం తెల్లవారుజామునే సిపిఎం నేతల ఇళ్లకు పోలీసులు చేరుకుని గృహనిర్బంధం చేశారు. కొద్దిసేపటికే సిపిఎం నేతలు డోకల లక్ష్మి, డి.రవితేజ, బివి.వర్మ, బి.రాంబాబులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న బొక్కా సత్యనారాయణను గృహ నిర్బంధం చేశారు. అనంతరం ఐ.భీమవరం రోడ్డుకు ఇరువైపులా పోలీసులు పెద్దసంఖ్యలో మొహరించి రాకపోకలను నియంత్రించారు. ఆపై ట్రాక్టర్లు, జెసిబిలు, పొక్లెయిన్లు రంగంలోకి దించడంతో నివాసితులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇళ్లలోని సామాన్లు తీసుకునేందుకు సమయం ఇవ్వాలని కోరడంతో అధికారులు కొద్దిసేపు గడువు ఇచ్చారు. అనంతరం ఇళ్ల కూల్చివేత, సామగ్రి తొలగింపు పనులు ప్రారంభించారు. బుధవారం సాయంత్రం ఐదు గంటలకు ఇళ్ల తొలగింపు దాదాపు పూర్తయ్యింది. ఆ సమయంలో పోలీసులు తమ అదుపులో ఉన్న సిపిఎం నేతలను విడిచిపెట్టారు.

పోలీసుల నిర్బంధంలో నేతలు

ఇళ్ల కూల్చివేత అక్రమం: సిపిఎం

ఇళ్లను కనీస వ్యవధి ఇవ్వకుండా కూల్చివేయడం అన్యాయమని, దీనిపై ప్రశ్నిస్తామనే భయంతో తమను నిర్బంధించడం దారుణమని సిపిఎం నాయకులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం రాత్రి చర్చల్లో కనీసం ఐదు నుండి పది రోజులు సమయం ఇస్తామని చెప్పిన అధికారులు బుధవారం తెల్లవారకముందే మాటమార్చి ఇళ్ల తొలగింపు చేపట్టడం ఎంతవరకూ సమంజసమో చెప్పాలన్నారు.

పోలీసు స్టేషన్ వద్ద నిరసన

సిపిఎం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవటాన్ని నిరసిస్తూ పెద్దసంఖ్యలో నేతలు, కార్యకర్తలు బుధవారం మధ్యాహ్నం స్థానిక పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. తమ నాయకులను వెంటనే విడుదల చేయాలని, ఇళ్ల తొలగింపు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సందక సూరిబాబు, సందక ఉదయ కుమారి, గేదెల ధనుష్, లావణ్య, బి.కళ్యాణి, దొడ్డి పద్మ, బి.అప్పలనాయుడు, పంపన కృష్ణవేణి, జి.పద్మనాభం, ఉమ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పోలీసు స్టేషన్ వద్ద సిపిఎం నేతల నిరసన

జెవివి కార్యక్రమాలు అమోఘం

ఆర్‌జెడి, ఇన్‌ఛార్జి డిఇఒ నాగమణి

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - భీమవరం

జన విజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలు అమోఘమని విద్యాశాఖ ఆర్‌జెడి, ఇన్‌ఛార్జి డిఇఒ జి.నాగమణి అన్నారు. జెవివి 34 ఏళ్లుగా ప్రతియేటా హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలు-2024 పోస్టర్‌ను స్థానిక కలెక్టరేట్‌లో ఆమె బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక కార్యక్రమాలను ప్రశంసించారు. చెకుముకి జిల్లా కన్వీనర్ రేపాక వెంకన్నబాబు మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలు విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందిస్తాయన్నారు. ఈ సంబరాలు పాఠశాలస్థాయిలో సెప్టెంబర్ 25న, మండలస్థాయిలో అక్టోబర్ ఒకటో తేదీన, జిల్లాస్థాయిలో అక్టోబర్ 27న, రాష్ట్రస్థాయిలో నవంబర్ 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.సత్యనారాయణ, జెవివి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చింతపల్లి ప్రసాదరావు, జె.రామలక్ష్మణరావు, కోశాధికారి మల్లుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు వై.అజయ్‌కుమార్, టి.వెంకటేశ్వరరావు, ఎ.జాన్సన్, పి.ఫణిరాజేష్, ఎస్.ప్రేమరాజు, ఎంఇఒ ఎం.శ్రీమన్నారాయణ, ఎమ్‌డిఎం కోఆర్డినేటర్ జి.చిన్నయ్య పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరించిన ఆర్‌జెడి నాగమణి, జెవివి నేతలు

ఏదోకరోజు సిఎం పవన్‌కళ్యాణే

భీమవరం ఎంఎల్‌ఎ అంజిబాబు

ప్రజాశక్తి - వీరవాసరం

రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ ఏదోక రోజు సిఎం అవుతారని భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. కొణితివాడలో బుధవారం యరకరాజు హరిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనసేన కార్యాలయాన్ని, గవరపాలెంలో జనసేన జెండా స్తూపాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ కొణితివాడ, గవరపాలెం ప్రజలు నా గుండె చప్పుడన్నారు. ఇక్కడ ప్రాధన్యతా క్రమంలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తానన్నారు. అవసరమైన వంతెనను త్వరలో నిర్మిస్తానన్నారు. నవుడూరు నుండి మడుగుపోలవరం వరకు డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. పవన్‌కళ్యాణ్ పార్టీ పెట్టింది ప్రజలకు సేవ చేయడానికేనన్నారు. కార్యక్రమంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్‌నాయుడు, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, ఆయా పార్టీల నేతలు యరకరాజు గోపాలకృష్ణంరాజు, కోళ్ల నాగేశ్వరరావు, వీరవల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



జనసేన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ అంజిబాబు

అమరవీరుల త్యాగం మరువలేనిది

పలుచోట్ల విద్యుత్ పోరాట అమరులకు ఘన నివాళి

ప్రజాశక్తి - భీమవరం

విద్యుత్ పోరాటంలో ప్రాణాలర్పించిన అమరుల త్యాగం ఏనాటికి మరువలేనిదని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. 100 రోజుల విద్యుత్ పోరాటం ఫలితం, నాటి ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపిన విషయాన్ని నేటి పాలకులు గుర్తించకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. బుధవారం మెంటేవారి తోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనం వద్ద విద్యుత్ అమరవీరులు రామకృష్ణ బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డిల సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా సెక్రటేరియట్ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్‌లు మాట్లాడారు. అప్పటి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు భారాన్ని ప్రజలపై వేస్తే దానికి వ్యతిరేకంగా వంద రోజుల పాటు సుదీర్ఘ పోరాటం అనంతరం బషీర్ బాగ్‌లో ప్రభుత్వం ధమనకాండ జరిపిందని, దాని ఫలితం ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని, అనేకమంది గాయపడ్డారని గుర్తు చేశారు. నాటి అమరుల ప్రాణ త్యాగం ఫలితంగా ప్రభుత్వం విధించిన భారాలను వెనక్కి తీసుకోక తప్పలేదని చెప్పారు. నేటి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచినా, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రయత్నించినా మరో విద్యుత్ పోరాటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్న విషయాన్ని గుర్తించాలని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు చిత్తశుద్ధితో కృషిచేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, ఎం.వైకుంఠరావు, ప్రజా సంఘాల నాయకులు చల్లబోయిన వెంకటేశ్వరరావు, గోపాలరాజు, డి.త్రిమూర్తులు, ఎ.రాంబాబు, రత్నకుమారి, లత పాల్గొన్నారు.

భీమవరం : అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ అమరవీరుల 24వ వర్థంతి సభ బుధవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నిర్వహించారు. జోహార్ విద్యుత్ అమరవీరులకు, సాధిస్తాం సాధిస్తాం అమరవీరుల ఆశయాలను అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అమరవీరుల చిత్రపటానికి సిపిఎం నాయకులు సిరపరపు రంగారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పట్టణ నాయకులు సిరపరపు రంగారావు, కరెడ్ల రామకృష్ణలు హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు ప్రపంచ బ్యాంకు షరతులకు లొంగి, విద్యుత్ భారాలు వేయవద్దని కోరుతూ 2000 సంవత్సరంలో సిపిఎం, వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ మహోద్యమం ఉవ్వెత్తున సాగిందని వారు అన్నారు. ఆనాటి పోరాటంలో అసువులు బాసిన అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు, జవ్వాది శ్రీను, కరక వెంకటరావు, నరమాల కృష్ణ, మేత్రెడ్డి రమణ, గొర్రెల సతీష్, పైలు చిన్నా, శిద్దిరెడ్డి శేషు, అడపా లోవ, యడవల్లి వెంకట దుర్గారావు, పతివాడ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో..

పెంటపాడు : విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా 2000 సంవత్సరంలో హైదరాబాద్‌లోని బషీరాబాద్‌లో జరిగిన విద్యుత్ సంస్కరణ వ్యతిరేక పోరాటంలో అమరులైన వారి సంస్మరణ సభ బుధవారం పెంటపాడు మండలం ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బషీరాబాద్ విద్యుత్ ఉద్యమంలో ప్రాణాలర్పించిన యోధులు కామ్రేడ్ రామకృష్ణ, కామ్రేడ్ బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డిలకు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబురావు, మండల సిపిఎం కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు సిరపరపు రంగారావులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, వైసిపిర్ ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలు కూటమి ప్రభుత్వం తక్షణమే రద్దుచేయాలని, ప్రజల మీద అమలవుతున్న అదనపు భారాలను తగ్గించాలని, వ్యవసాయంకు, విద్యుత్తు వినియోగదారులకి విపరీతమైన భారం కానున్న విద్యుత్ మీటర్లకు స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని విరమించాలని అన్నారు. వైసిపి ప్రభుత్వం ఆదాని కంపెనీతో విద్యుత్ మీటర్ల కొనుగోలుపై చేసిన ఒప్పందాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ వర్ధంతి సభలో పూడి బాలాజీ, కర్రి సత్తిరెడ్డి, రాజేష్, జి.శివ, పప్పుల ప్రభాకర్, ఎం.త్రిమూర్తులు, కర్రి సత్తిరెడ్డి పాల్గొన్నారు.

పాలకొల్లు : విద్యుత్ పోరాట అమరవీరులకు పాలకొల్లులో సిపిఎం నేతలు నివాళులర్పించారు. సిఐటియు నాయకులు జవ్వాది శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్ వద్దు పాత విధానమే కొనసాగించాలని కోరారు. మీటర్ రీడర్స్‌కు పని భద్రత కల్పించాలని కోరారు. అమరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమిద్దాం అని శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి సత్యనారాయణ, పి.సత్యనారాయణ, కృష్ణ, కృపావరం పాల్గొన్నారు.

శుచి, రుచికర ఆహార పదార్థాలు అందించాలి

అన్నక్యాంటీన్‌లో జెసి తనిఖీలు

ప్రజాశక్తి - తణుకు

అన్న క్యాంటీన్ ద్వారా శుచి, రుచికరమైన ఆహార పదార్థాలను అందించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సంబంధిత సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. పట్టణంలోని సొసైటీ రోడ్డులో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను జాయింట్ కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడుతూ ఆహార పదార్థాలు ఎలా ఉంటున్నాయి, మీరు ఏప్రాంతం నుండి వచ్చారు, ఈ పథకం ఉపయోగకరంగా ఉందా అని ఆరా తీశారు. క్యాంటీన్ నిర్వాహకులతో జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ క్యాంటీన్ లోపల, బయట పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వంట పాత్రలు శుభ్రపరచుకోవాలని, లేనిపక్షంలో ఆహారం కలుషితమై అనారోగ్యానికి దారితీస్తుందన్నారు. వాష్‌బేషిన్‌ను శుభ్రంగా ఉంచాలని, ఈగలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో తహాశీల్దార్ డివిఎస్ఎస్.అశోక్‌వర్మ, మున్సిపల్ డిఇ ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌కు వచ్చిన ప్రజలతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి.

పరిశ్రమల్లో భద్రతా చర్యలు చేపట్టాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా రామ్మోహన్ రాయ్

ప్రజాశక్తి - భీమవరం

ఇటీవల కాలంలో పరిశ్రమల్లో ప్రమాదాలు పెరిగాయని, వాటిని అరికట్టే చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని, తక్షణం పరిశ్రమల్లో భద్రతా చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ డిమాండ్ చేశారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో సిఐటియు జిల్లా కౌన్సిల్ సమావేశం సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాద నివారణా చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందన్నారు. ఫ్యాక్టరీల్లో తనిఖీలు లేకుండా యాజమాన్యాలు అనుకూలమైన చర్యలు తీసుకోవడం వల్ల ప్రమాదాలకు గురై వేలాదిమంది కార్మికులు చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పరిశ్రమల్లో భద్రతాచర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు కార్మిక చట్టాలు అమలు చేయడం లేదన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పేరుతో కార్మిక శ్రమను యాజమాన్యాలు దోసుకుంటున్నాయని విమర్శించారు. కనీస వేతనాల చట్టాన్ని సవరించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు గోపాలన్ మాట్లాడుతూ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయడం లేదన్నారు. కార్మికచట్టాలు అమలుచేయాలని కోరారు. రానున్న రోజుల్లో పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు బి.వాసుదేవరావు, డి.కళ్యాణి, కర్రి నాగేశ్వరరావు, సిరపరపు రంగారావు పాల్గొన్నారు.

తప్పులకు తావు లేదు : జెసి

తాడేపల్లిగూడెం: సుమోటో కుల ధృవీకరణ పత్రాల జారీ పరిశీలనలో భాగంగా బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తాడేపల్లిగూడెం తహాశీల్దార్ కార్యాలయంను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో విఆర్ఒలు ఎంక్వయిరీ చేసి రిజెక్ట్ చేసిన పత్రాలను పరిశీలించారు. చనిపోయిన వారి కుల ధృవీకరణ పత్రాలను రిజెక్ట్ చేయకుండా వారి ఫ్యామిలీ మెంబర్లకి అందజేయాలని సూచించారు. ఒక వార్డు నుంచి వేరొక వార్డు కాని లేక వేరే ప్రాంతానికి గాని వెళ్లినవారు ఉంటే వారికి సంబంధించిన కుల ధృవీకరణ పత్రాలను రిజెక్ట్ చేయకుండా ఆ ప్రాంతానికి చెందిన విఆర్ఒలను సంప్రదించి, వారి ద్వారా వివరాలను సేకరించి, సమగ్ర నిర్ధారణ చేసి వారికి అందజేయాలని ఆయన అన్నారు. ఎస్‌టి కులాలకు చెందినవారు ఉంటే చదువుకునే పిల్లలు రికార్డులు, గతంలో తహాశీల్దార్లు ఇచ్చిన ధృపత్రాల ఆధారంగా విచారణచేసిన తర్వాతే జారీ చేయాలన్నారు. అనంతరం పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ, (34, 36 వార్డులు) ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో సుమోటో కుల ధృవీకరణ పత్రాలు జారీపై తనిఖీలు నిర్వహించారు. లబ్ధిదారులతో స్వయంగా ఆయన మాట్లాడి వివరాలను రాబట్టారు. కులధృవీకరణ పత్రాల జారీలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా ఉండాలన్నారు. చిన్న పొరపాటు జరిగినా లబ్ధిదారులు నష్టపోతారని ఆయన సూచించారు. కుల ధృవీకరణ పత్రం జారీ విషయంలో ఖచ్చితమైన నిర్ధారణ చేసిన తర్వాతే లబ్ధిదారునికి అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ ఎం.సునీల్ కుమార్, ఆర్ఐ ప్రభు, విఆర్ఒలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న జెసి

జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోండి

జిల్లా జడ్జి డి.సత్యవతి

ప్రజాశక్తి - తణుకు

సెప్టెంబర్ 14వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీచేసుకొని డబ్బు, విలువైన సమయాన్ని కక్షిదారులు ఆదా చేసుకోవాలని ఛైర్మెన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి సూచించారు. బుధవారం తణుకు కోర్టు హాలులో, కోర్టులో పేరుకుపోయిన పెండింగ్ కేసులను తగ్గించాలని తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి డి.సత్యవతి మాట్లాడుతూ ప్రతిరోజూ కేసులు రాజీ చేయుటకు కోర్టులో ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నారని, పాల్‌పస్ ద్వారా ప్రతిరోజూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేసులు రాజీ చేస్తున్నారని అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సివిల్ కేసులు, మోటార్ వెహికల్, యాక్సిడెంట్ కేసులు, కుటుంబ తగాదా కేసులు, రాజీపడ్డ దగ్గ క్రిమినల్ కేసులు రాజీ చేయడంలో న్యాయవాదులు కృషి చేయాలని కోరారు. జాతీయ లోక్ అదాలత్ సమాచారం కోసం న్యాయవాదులను, పోలీసు సిబ్బందిని, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణ, సత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరాం, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పివికె.రంజిత్‌కుమార్, స్పెషల్ కోర్టు మేజిస్ట్రేట్ చిరంజీవిరావు, రెండవ అదనపు బెంచ్ కోర్టు స్పెషల్ మెజిస్ట్రేట్ తాడి ఆంజనేయులు పాల్గొన్నారు.

'జనవాణి'లో ఫిర్యాదుల స్వీకరణ

నరసాపురం: మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో జనవాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి సమస్యలకు అర్జీలు స్వీకరిస్తున్న సంగతి తెలిసిందే. బుధవారం ఈ కార్యక్రమంలో నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు పాల్గొన్నారు. ఇరువురూ కలిసి ప్రజల వద్ద వారి సమస్యలకు అర్జీలు స్వీకరించి, వాటిని నమోదు చేసుకున్నారు. వచ్చిన ఫిర్యాదులను డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి, సమస్యలను పరిష్కరిస్తామని ఫిర్యాదుదారులకు నాయకులు హామీ ఇచ్చారు.

దుర్గాలహరి కుటుంబానికి నష్టపరిహారమివ్వాలి

సిపిఎం ఆధ్వర్యాన వైద్యాధికారికి వినతి

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలో విషజ్వరం ప్రభావంతో ఇటీవల మృతిచెందిన దుర్గాలహరి కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈమేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్, పార్టీ మండల నాయకులు బుధవారం భీమవరం జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ భాను నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గాలహరి మరణానికి కారణమైన అధికారులపై తక్షణమే చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆమెకు చేసిన వైద్యం వికటించడం వల్ల మరణం సంభవించిందని తల్లిదండ్రులు చెప్తున్నారని ఆరోపణపై కనీస చర్యలు చేపట్టకపోవడం దారుణం అన్నారు. దీనిపై అధికారులు వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుని కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. పెంకె అప్పారావు, మొవ్వ శీను, ఆయన మండలం మంగరాజు, ఎం.చిన్నిశ్రీనివాస్ పాల్గొన్నారు.



వినతినందిస్తున్న సిపిఎం నాయకులు

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ట్రాఫిక్ పోలీసులు

హెల్మెట్ ధరించాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వాహనదారులంతా హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం ద్వారా ప్రాణాలు రక్షించుకోవచ్చు అని ఎస్ఐ ఎస్ కొండలరావు సూచించారు. మీపై ఆధారపడి మీ కుటుంబం ఉందని, వారి క్షేమం కోసం వాహనదారులు అందరూ హెల్మెట్ ఉపయోగించాలని కోరుతూ పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.కొండలరావు సూచించారు. బుధవారం శ్రీవాసవి జిఎంఆర్ డిగ్రీ కాలేజ్ విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం ద్వారా ప్రాణాలు కోల్పోయిన వారి వివరాలు తెలియజేస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి.ఎస్.ఎన్.శ్రీనివాస్, విద్యార్థులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి ఎయిర్‌కూలర్ బహూకరణ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురంలో వేంచేసియున్న శ్రీఎంబరు మన్నారు కోవెల గుడికి కాపు వనితా క్లబ్ అధ్యక్షురాలు పుప్పాల ఉమామహేశ్వరి, సత్య శ్రీనివాస్ నాయుడు దంపతులు భక్తుల సౌకర్యార్థం రూ.22 వేల విలువగల ఎయిర్ కూలర్‌ని బహూకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, పశ్చిమగోదావరి జిల్లా మహిళా అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఎండ తీవ్రతను తగ్గించి భక్తులు స్వామి సన్నిధిలో ఎక్కువసేపు ఉండేందుకు సహకరించిన శ్రీనివాస్ నాయుడు, ఉమామహేశ్వరి దంపతులను డాక్టర్ రాజ్యలక్ష్మి అభినందించారు. ఈ కార్యక్రమంలో పుప్పాల కృష్ణప్రసాద్, వనితాక్లబ్ కార్యదర్శి బండి సుస్థిరల, కోశాధికారి రంగినీడి భరణి, ఉపాధ్యక్షురాలు పుప్పాల ఉషాకమల, గంటా వెంకటరమణ, తోట అరుణ, నాగమణి పాల్గొన్నారు.

కళాశాలలో స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం దీక్షారంభ్ కార్యక్రమాన్ని నూతనంగా డిగ్రీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు ప్రిన్సిపల్ డాక్టర్ బి.రాజారత్నం అధ్యక్షతన ప్రారంభించారు. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 17 వరకు 21 రోజులపాటు నిర్వహిస్తారు. ప్రోగ్రాంపై ప్రతిరోజు ఒక్కొక్క అంశంపై విద్యార్థులకు కళాశాల అధ్యాపకులు అవగాహన కల్పిస్తారు. నూతన విద్యావిధానం 2020, అకడమిక్ అంశాల ప్రాధాన్యత, లైబ్రరీ ప్రాధాన్యత, క్రీడలు, కల్చరల్ ప్రోగ్రామ్స్, అకడమిక్ బ్యాంక్ క్రెడిట్, బెస్ట్ ప్రాక్టీసెస్, స్వచ్ఛభారత్, నాక్ క్రైటీరియా మొదలగు అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.శ్యామల, అకాడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.ఉషారాణి, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ కె.భద్రాచలం పాల్గొన్నారు.

నారుమళ్ల పరిశీలన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని మొగల్తూరు, రామన్నపాలెం తదితర గ్రామాల్లో బుధవారం ఉండి కెవికె శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, ప్రోగ్రాం కో - ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు, డాక్టర్ పి.వినయలక్ష్మి పంటల యాజమాన్య విభాగం శాస్త్రవేత్త, సహాయ వ్యవసాయ సంచాలకులు ఇ.అనిలకుమారి, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అబ్దుల్ రహిమ్ వరిపొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ముంపుకు గురైన వరిచేల నుంచి నీటిని బయటకు తోడి అనంతరం ఎకరాకి 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను కలిపి చల్లాలని అన్నారు. ఒక లీటరు నీటిలో 1 గ్రాము కార్బెండిజమ్ లేదా మాంకోజెబ్ కలిపిన మిశ్రమాన్ని పిచికారీ చేయాలని సూచించారు. పలు సూచనలు చేశారు. అన్నదాతలు అధిక యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి సాధించాలని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో రైతు భరోసా కేంద్ర ఇన్‌ఛార్జి ఎ.రాజగోపాల్, రైతులు దాసరి గోపాలకృష్ణ, యతం పాండు రంగారావు, పలువురు రైతులు ఉన్నారు.

ఆక్వా రంగంలో లైసెన్స్ తప్పనిసరి

ఉండి: ఆక్వా రంగానికి సంబంధించిన అన్ని వర్గాల వారు అప్సడా చట్టం, ఎంపెడాలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎంపెడా ఎడి సిహెచ్.ఆనంద్ అన్నారు. బుధవారం ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో మత్స్యశాఖ, ఎంపెడా సంయుక్త ఆధ్వర్యంలో ఎఫ్‌డిఓ సిహెచ్.రాంబాబు అధ్యక్షతన ఆక్వా రైతులకు, ఆక్వా డీలర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిహెచ్ ఆనంద్, మత్స్యశాఖ శాస్త్రవేత్త ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఆక్వాదారుడు అప్సడా అనుమతులు తప్పనిసరి అని, అనుమతులు లేని రైతులు వెంటనే అనుమతులు పొందాలని వారు సూచించారు. వి.ఎఫ్.ఎ లు కె.రాజేష్, ఎం.ప్రకాష్, టి.భారతి, ఎస్ రాజేష్, ఆక్వా రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

మాధవాయిపాలెం రేవుపాట ఖరారు

నరసాపురం: మాధవాయిపాలెం రేవు పాట ఎట్టకేలకు ఖరారైంది. రూ.2,98,00008 కోట్లకు యలమంచిలి మండలం కనకాయలంకకు చెందిన ది కనకదుర్గ శాండ్ అండ్ క్వారీ లేబర్స్ ఫీల్డ్ లేబర్, ఫిషర్‌మెన్ కోపరేటివ్ సొసైటీ పాటను దక్కించుకుంది. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పరిషత్ అధికారి అధ్యక్షతన రేవు పాట నిర్వహించారు. పర్యవేక్షణా అధికారిగా డిప్యూటీ సిఇఒ నిర్మలాజ్యోతి హాజరయ్యారు. నలుగురు పాటదారులు మాత్రమే ఇఎండి కట్టి పాటలో పాల్గొన్నారు. ముందు బహిరంగ వేలం నిర్వహించారు. ఇందులో పెద్దూరు కొనుగోలు చేసిన ది నరసాపురం శాండ్ క్వారీ వీవర్స్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ ఏఆర్ లక్ష్మీపాలెం శాండ్ క్వారీ లేబర్ సొసైటీ, ది కనకదుర్గ శాండ్ క్వారీ లేబర్ సొసైటీ, అమరేశ్వర శాండ్ ఫిషర్‌మెన్ సొసైటీలు పాల్గొన్నాయి. పాట ప్రారంభ ధర రూ.2.97 కోట్లు నుంచి ప్రారంభించారు. ముందుగా బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఇందులో అమరేశ్వర సొసైటీ రూ.2,97,88,717 పాడింది. ఆ తరువాత సీల్డ్ టెండర్లు తెరిచారు. ఇందులో నలుగురు పాటదారులలో మూడు మాత్రమే టెండర్లు వేశారు. బహిరంగ వేలం కంటే ఎక్కువగా వేసిన మొత్తం ఎక్కువగా ఉన్న కనకదుర్గ సొసైటీ పాటదారునికి అధికారులు ఖరారు చేశారు. సెప్టెంబర్ 1 నుంచి మార్చి 31 వరకు రేవు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తారు.

ప్రభుత్వాసుపత్రిలో ఆర్‌డిఒ తనిఖీలు

నరసాపురం: నరసాపురం ఆర్‌డిఒ ఎం.అచ్యుతఅంబరీష్ బుధవారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. తొలుత ఆరోగ్య శ్రీ పేషెంట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్యసదుపాయం అంశంలో ఏమైనా లోపాలున్నాయా? అనే విషయంపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జ్వరాలతో వచ్చే రోగుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులను ఆదేశించారు. వ్యాధుల విషయంలో, పరిసరాల పరిశుభ్రత పై వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. రోగాలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. రోగుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని చెప్పారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుప్రియ ఆర్‌డిఒ వెంట ఉన్నారు.

ఉత్తమ గ్రంథాలయ అధికారిగా కుమారి

నరసాపురం: ఉత్తమ గ్రంథాలయ అధికారిగా రాష్ట్ర గ్రంథాలయ సంస్థ స్థాయిలో శాఖాపరంగా కొలను పర్వతాలరాజు, ఎస్ఐ లైబ్రరీ మేనేజర్ కలెక్టర్ వెట్రిసెల్వి చేతుల మీదుగా ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయాధికారి కెఇఎన్ఎల్ కుమారి అవార్డ్ అందుకున్నారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ, రీడర్స్ గ్రీన్ లైబ్రరియన్ కుమారిని అభినందించి సత్కరించారు. ఈ సభకు సుధీర్ మోహన్ స్వాగతం పలుకగా శాస్త్రవేత్త సుబ్బారావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ అవార్డ్ గ్రహీత లైబ్రేరియన్ కుమారి గ్రంథాలయంలో అంకితభావంతో అత్యుత్తమ సేవలు అందించారన్నారు. గ్రంథాలయంలో జరిగే వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు, గ్రంథాలయ వారోత్సవాలలో పిల్లలందరికీ వివిధ విజ్ఞాన విషయ కార్యక్రమాలు నిర్వహించి అంకితభావంతో అత్యుత్తమ సేవలనందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్మన్ నల్లిని దేవి, బాబూరావు, మున్సిపల్ స్కూల్ హెచ్ఎం వి.నాగలక్ష్మి, సంజు డాన్స్ అకాడమీ ఆత్మూరి రమ, ఎక్స్ మిలిటరీ సలాది రామారావు, హిందీ టీచర్ భట్టిప్రోలు సత్యనారాయణ కుమారిని అభినందించి ప్రశంసించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కోసేటప్పుడే కాదు.. కొనేటప్పుడూ కన్నీరే!

ఉల్లికి పెరిగిన డిమాండ్

కిలో రూ.60 పైమాటే

రోజురోజుకూ పెరుగుదల.. ఉత్పత్తి తగ్గుదల

సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం

ఆటోపై ఉల్లిపాయలు అమ్ముతున్న వర్తకుడు

ప్రజాశక్తి - ఆచంట

ఉల్లి ధర సామాన్యులను బెంబేలెత్తిస్తుంది. కోస్తే కన్నీరు పెట్టించే ఉల్లి ప్రస్తుతం కొంటేనే కన్నీరు పెట్టిస్తుంది. క్షణక్షణానికి మారుతున్న వాతావరణం ఉల్లి సాగుకు శాపంగా మారింది. డిమాండ్ ఉన్న సమయంలో మార్కెట్‌కు అవసరమైన మేర ఉల్లిపాయలు రాని పరిస్థితి. మరోవైపు, డిమాండ్ లేని రోజుల్లో లారీలకు లారీల ఉల్లి మార్కెట్‌కి వచ్చి పడుతుంది. దీంతో ఉల్లి మార్కెట్ గతంలో ఎన్నడూ లేని విధంగా ఆటుపోట్లను ఎదుర్కొంటుంది. కర్నూలు ఉల్లి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఎప్పుడు సరుకులు మార్కెట్‌కు తరలిస్తే తమ కష్టానికి తగ్గ ఫలితం లభిస్తుందో తెలియని అయోమయ పరిస్థితిలో రైతన్నలు ఉన్నారు.

ఉల్లి ధరలు రోజుకో రకంగా మారడంతో అప్పుడే సంతోషం.. ఆ మర క్షణమే విచారం అన్న చందంగా మారింది రైతుల పరిస్థితి. మరోవైపు ఉల్లిపాయలు తీసినవి తీసినట్లుగా విక్రయించుకుంటే కానీ కర్నూలు ఉల్లి రైతులు గట్టెక్కలేరు. ఒక్కసారి ఉల్లిపాయలు తీసే సమయంలో వర్షం పడితే ఇక అంతే సంగతులు. వాతావరణంలో మార్పులు ఉల్లి పంటపై ప్రభావం చూపాయి. దీంతో డిమాండ్ మేర ఉల్లిపాయలు గడిచిన మూడు వారాలుగా మార్కెట్‌కు రావడం లేదని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. దిగుమతి దారుల నుంచి ముఖ్యంగా ఒడిశా ఎగుమతి దారుల నుంచి డిమాండ్ బాగుండడంతో ధరలకు రెక్కలు వచ్చాయి. ఆకర్షించే మెరుపు, ఎరుపు కర్నూలు ఉల్లి ప్రత్యేకత. అయితే వాతావరణం ప్రభావంతో ఇప్పుడా పరిస్థితి లేదు. మట్టి రంగు ఉల్లిపాయలు ప్రస్తుతం మార్కెట్‌కు అధికంగా వస్తున్నాయి. దీంతో వీటికి తగిన ధర లభించడం లేదు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో ఉల్లిపాయలు రూ.60కు పలుకుతున్నాయి. ప్రాంతాలవారీగా ధరల్లో వ్యత్యాసం కనిపిస్తుంది. దాదాపు పదిరోజుల నుంచి ఉల్లి ధర పెరుగుతూనే ఉంది. గత 15 రోజుల క్రితం మూడు కేజీలు రూ.100 ఉండగా, ఇప్పుడు కిలో రూ.60 నుంచి 65 వరకు ధర పలుకుతుంది. ఇది మరింత హెచ్చుతుందని చిల్లర కూరగాయల వర్తకులు చెబుతున్నారు. ఒక దశలో సంచార వ్యాపారులు కిలో రూ.55 నుంచి 60 వరకు అమ్మకాలు చేపట్టారు. ఒక్కసారిగా ఉల్లి ధరలో మార్పు రావడంతో అన్ని వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రధానంగా మన జిల్లాకు మహారాష్ట్ర, నంద్యాల ప్రాంతాల నుంచి వచ్చే ఉల్లిపాయల సరఫరా గణనీయంగా తగ్గడంతో ధర పెరుగుదలకు కారణమైందని ఉల్లి హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. జిల్లాలో ఉల్లికి తాడేపల్లిగూడెం మార్కెట్ ప్రధాన కేంద్రం. ఇక్కడ నుంచి జిల్లా నలుమూలలతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు డిమాండ్‌ను బట్టి ఎగుమతులు జరుగుతుంటాయి. రోజూ జిల్లా మొత్తం మీద 100 క్వింటాలకు పైగా ఉల్లి దిగుమతులు జరుగుతుంటాయని ఓ అంచనా. మహారాష్ట్రలోని పూణే, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల నుంచి కూడా ఉల్లి దిగుబడులు రాష్ట్రానికి వస్తాయి. అయితే అక్కడ కూడా వర్షాలు ముంచెత్తడంతో, పంటలు దెబ్బతినడంతో ధరలు పెరుగుతుంటాయని మరో కారణంగా చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లోకి గత వర్షాలకు దెబ్బతిన్న ఉల్లి, గత పంటల్లో నిలువ చేసిన సరుకు మాత్రమే రావడంతో అధిక లాభాల కోసం హోల్‌సేల్ వ్యాపారులు ఉన్న సరుకులు బ్లాక్ చేస్తున్నారని సమాచారం. వినియోగదారులు అవసరాలకు సరిపడా ఉల్లి రాకపోవడంతో ధరలు భగ్గుమనడంతో ఆవేదన చెందుతున్నారు. వారానికి రెండు కిలోల ఉల్లిపాయలు వాడే పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు ధరలు పెరగడంతో వారానికి ఒక్క కిలోకు తగ్గించుకుంటున్నారు. మరోవైపు పండుగ, పెళ్లిళ్ల సీజన్ కావడంతో నిత్యవసరాల ధరలు క్రమేపి పెరుగుతున్నాయి. ఇప్పటికే పెరిగిన ధరలతో సామాన్యులు అల్లాడుతుంటే మరింత ఉల్లి ధరలు పెరుగుతుండడంతో కన్నీళ్లు తెప్పిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం రైతు బజార్ల ద్వారా తెలుపు రేషన్ కార్డుదారులకు తక్కువ ధరకే సరఫరా చేసేది. ఆ సమయంలోను పూర్తిస్థాయిలో ఉల్లిపాయలు అందక కొంత ఇబ్బంది పడ్డారు. ఇప్పుడు ప్రభుత్వం ఆ దిశగా యోచన చేయాలని ప్రజలు కోరుతున్నారు. పాత ఉల్లిపాయలకున్న డిమాండ్ రోజురోజుకు పెరగడంతో వీటికి మంచి ధర లభిస్తుంది. వాతావరణ మార్పులు ఇదే విధంగా కొనసాగితే కర్నూలు ఉల్లిపాయ ధరలు కూడా మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు తెలిపారు. ఉల్లిపాయల ధరలు రోజురోజుకు పెరిగిపోవడంతో సామాన్య, పేద వర్గాల ప్రజలు అల్లాడుతున్నారు. ఉల్లి ధరల నియంత్రణలో ప్రభుత్వం చేతులెత్తేసింది. గత రెండు వారాలుగా ఉల్లి ధరలు కొండెక్కి కూర్చున్నా ప్రభుత్వం చోద్యం చూస్తుంది తప్ప నియంత్రణకు కనీస చర్యలు చేపట్టడం లేదని ప్రజలు బాహ్యాంగా విమర్శిస్తున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై ఉల్లిపాయలు అందించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఉల్లి కొనుగోలు ఆర్థిక భారంగా మారింది

మానుకొండ రాంబాబు, పెనుమంచిలి

రోజు రోజుకు ఉల్లిపాయల రేటు మార్కెట్‌లో పెరుగుతుండడంతో వాటి కొనుగోలు ఆర్థిక భారంగా మారింది. ధర పెరిగినా కొనుగోలు చేయడం తప్పడం లేదు. అసలే పనులు లేక, చేతిలో చిల్లు గవ్వలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నేపథ్యంలో గోరుచుట్టుపై రోకలి పోటులా ఉల్లి ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి.

ఉల్లి ధరలు నియంత్రించాలి

సరిళ్ల రాధాకృష్ణ, అయోధ్యలంక

మార్కెట్లో ఉల్లిపాయల ధరలు తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేయాలి. ఈ విషయంలో ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున దిగుమతి చేసుకోవాలి. ఒకేసారి 4, 5 కేజీలు కొనేవాళ్లు ప్రస్తుతం కేజీకే పరిమితమవుతున్నాం. పదిరోజుల్లోనే కేజీకి రూ.25 పెరిగిపోవడం దారుణం.

పూర్తిగా దగ్ధమైన తాటాకిల్లు

కందరవల్లిలో తాటాకిల్లు దగ్ధం

కట్టుబట్టలతో రోడ్డున పడ్డ కుటుంబం

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని కందరవల్లి గ్రామ సచివాలయం సమీపంలో చెరువు గట్టున ఉన్న తాటాకు ఇల్లు బుధవారం ఉదయం అగ్నికి ఆహుతైంది. కటారి ఏడుకొండలకు చెందిన తాటాకు ఇల్లు పూర్తిగా దగ్గమై కట్టుబట్టలతో ఆ కుటుంబం రోడ్డున పడ్డది. బాధితుడు కొబ్బరి వలపు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. స్థానికులు సకాలంలో స్పందించి మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇళ్లలోని సామాగ్రి, బట్టలు అగ్నికి ఆహుతి కావడంతో బాధిత కుటుంబం రోడ్డున పడ్డారు. ప్రమాదానికి కారణాలు తెలియ రాలేదు. భార్య సుభాష్ ఉపాధి నిమిత్తం ఇటీవలే ఇతర దేశాలకు వెళ్లింది. భార్య పంపిన రూ.9 వేలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. డ్వాక్రా కట్టేందుకు దాచుకున్న డబ్బులు కూడా పూర్తిగా కాలిపోయాయని బాధితులు ఏడుకొండలు ఆవేదన వ్యక్తం చేశారు. ముగ్గురు చిన్న పిల్లలతో కుటుంబ పోషణ భారంగా మారడంతో పాటు, ఇల్లు కట్టుకునేందుకు భార్యను ఇతర దేశాలకు పంపినట్లు ఆయన తెలిపారు. సర్పంచి బోడపాటి బుల్లయ్య, వైస్ ఎంపిపి ఎర్రగుప్పల నాగరాజు, రెవెన్యూ ఎలక్ట్రికల్ సిబ్బంది, గ్రామస్తులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

బస్‌పాస్‌లు అందిస్తున్న మానవత సభ్యులు

విభిన్న ప్రతిభావంతులకు ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మానవత స్వచ్ఛంద సేవాసంస్థ పెనుమంట్ర శాఖ, నరసాపురం ఆర్‌టిసి డిపో వారి సౌజన్యంతో మార్టేరు మానవతా కార్యాలయంలో బుధవారం విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా బస్సుపాసుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నరసాపురం ఆర్‌టిసి డిపో మేనేజర్, అంతర్జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారులు సత్తి సుబ్బన్న రెడ్డి, మానవత అధ్యక్షులు కర్రి కృష్ణారెడ్డిలు ఉచిత బస్‌పాస్‌ల శిబిరాన్ని ప్రారంభించారు. అభాగ్యులను ఆదుకోవడంలో మానవతా సంస్థ ముందుంటుందని అధ్యక్షులు కృష్ణారెడ్డి అన్నారు. శిబిరానికి మార్టేరు పరిసర ప్రాంతాల నుంచి 70 మంది విభిన్న ప్రతిభావంతులకు బస్‌పాస్‌లు అందజేశారు. ఈ శిబిరంలో కార్యదర్శి శ్రీనివాసుల మురళీకృష్ణ, కోశాధికారి చదువుల నరేంద్ర, రీజనల్ ఛైర్మన్ బాణాల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు అమృతవాక్కుల సత్యనారాయణ, నరసాపురం డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి, బోర్డు డైరెక్టర్‌లు చిర్ల సూర్యనారాయణ రెడ్డి, పడాల జగన్నాథ రెడ్డి, మానవత డ్రైవర్ గుబ్బల శ్రీనివాస్, ఆర్‌టిసి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆక్వా రైతులకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు ఆక్వా రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించనున్నామని మత్స్యశాఖ మండల అధికారి కె.వివేక్ సూచించారు. ఈ సమావేశానికి ఆక్వా రైతులు, డీలర్లు హాజరుకావాలని కోరారు.

ఆక్వాసాగుపై అవగాహన

వీరవాసరం : మత్స్యశాఖ, ఎంపెడా సంయుక్త ఆధ్వర్యంలో అప్సడా అనుమతులు, ఎంపెడా ఎన్‌రోల్‌మెంట్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. రాయకుదురు పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన ఈ సదస్సులో మత్స్యశాఖ ఎడి మాట్లాడుతూ ఎపిఎస్ ఎడిఎం అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనుమతులు లేని ఆక్వారైతులు త్వరితగతిన అనుమతులు పొందాలని, సీడ్ నాణ్యత, ఫీడ్ నాణ్యతను ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రయోగశాలలో పరీక్షించుకున్న తర్వాతనే వాడుకోవాలని రైతులను కోరారు. అలాగే ఆక్వా రైతులు మంచి యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మంచి ఉత్పత్తిను పొందవచ్చునని అన్నారు. ఆక్వా రైతులు 10 ఎకరాలకు మించిన వారికి విద్యుత్ సబ్సిడీ వర్తింపు జరిగేలా సిఫారసు చేస్తామన్నారు. ఎంపెడ ఎఫ్‌టిఒ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఎంపెడ వారు మన జిల్లా నుంచి ఎగుమతి అయ్యే ఆక్వా ఉత్పత్తుల కోసం వారి వద్ద నమోదు చేసుకోవాలని, ధరల ఆటుపోట్లు, మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని సాగుచేయాలని తెలిపారు. ఎంపెడా దరఖాస్తు ప్రక్రియను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆక్వా రైతులు మాట్లాడుతూ గుర్తింపు పొందిన హాచరీల వివరాలను ఆక్వా రైతులకు ఎల్లప్పుడూ తెలిసేలా అందుబాటులోకి తీసు కురావాలని, మార్కెటింగ్ సమస్యలను పరిష్కరించే దిశగా, తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి వెళ్లేలా చేసి సాగుకు తోడ్పాటు అందించాలని ఆక్వా రైతులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచి గెడ్డం భారతి, మండలంలోని ఆక్వారైతులు, ఆక్వా డీలర్లు, వీరవాసరం గ్రామ మత్స్యశాఖ సిబ్బంది బాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పవన్‌ను విమర్శించే అర్హత కొట్టుకు లేదు

ఎంఎల్‌ఎ బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు లేదని తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం జనసేన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మంగళవారం పాత్రికేయుల సమావేశం పెట్టి పవన్ కళ్యాణ్ పై కొట్టు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. 60 రోజుల పరిపాలనలో ప్రతిక్షణం ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ఇప్పటికే గ్రామాల్లో అత్యవసరమైన తాగునీరు, రోడ్లు తదితర కార్యక్రమాలకు శంకుస్థాపన చేశామని చెప్పారు. ఐదేళ్లపాటు అవినీతి సొమ్ముకు అలవాటు పడిన మీకు 60 రోజులుగా ఆదాయం లేకపోయేసరికి సమస్యలన్నీ గుర్తొస్తున్నాయా అంటూ ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో ఇల్లు కట్టుకోవాలంటే సామాన్యులను సైతం వదలకుండా సొమ్ములు వసూలు చేసిన ఘనత మీకే దక్కుతుందన్నారు. మట్టి తవ్వకాల్లో డబ్బులు సంపాదించారని, గవర్నమెంట్ మద్యం షాపుల లీజు పేరుతో ప్రతినెలా ఆదాయం వచ్చేలా ఏర్పాట్లు చేసుకొని అవినీతి సొమ్ము ఇకపై రాదనే బాధతో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. కార్యకర్తలకు కప్పు కాఫీ ఇవ్వలేని మీరు నిజాయితీపరులైన జనసేన కార్యకర్తలను విమర్శించడం తగదని, మీ ఇల్లు చక్కబెట్టుకుని మాపై విమర్శలు చేయాలన్నారు. మీరు పార్టీ మారుతారేమో అన్న అభిప్రాయం మీ కార్యకర్తల్లో ఉంది దానిని తొలగించుకోవడానికి ప్రయత్నించాలన్నారు.

లైన్‌మెన్ రాజు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని భీమలాపురం గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై ఇటీవల మృతిచెందిన లైన్‌మెన్ రాజు కుటుంబానికి భీమలాపురం గ్రామస్తులు ఆపన్న హస్తం అందించారు. భీమలాపురం గ్రామంలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న రాజు ఆకస్మికంగా విద్యుత్‌షాక్‌కు గురై మరణించిన సంగతి విధితమే. అతి చిన్న వయసులోనే మరణించి, భార్యాపిల్లలకు దూరమై పట్టుడు దుఖంలో ఉన్న ఆ కుటుంబాన్ని ఆదుకోవాలనే ధృడ నిచ్చయంతో భీమలాపురం గ్రామస్తులు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా సర్పంచి గుబ్బల మాధవరావు మాట్లాడుతూ భీమలాపురం గ్రామంలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ కరెంటు షాక్‌కు గురై, మృతిచెందిన వ్యక్తిని ఆదుకోవాలనే లక్ష్యంతో అతని కుటుంబానికి రూ.లక్షా 35 వేలు రాజు పిల్లల పేరున బ్యాంకులో ఫిక్సడ్ డిపాజిట్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి చింతపర్తి సత్యనారాయణ సమక్షంలో ద్వాదశి సీతారామయ్య, మొల్లేటి త్రిమూర్తులు, ముడకల రాము, తోటా త్రిమూర్తులు, కౌరు త్రిమూర్తులు, గ్రామ ప్రజలు కలిసి ఈ నిధిని రాజు కుటుంబానికి అందజేయడం జరిగింది.

రాయకుదురు పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి - వీరవాసరం

సర్వశిక్షా అభియాన్ ఎపిసి పి.శ్యాంసుందర్ రాయకుదురు కవురువారి వీధి ప్రాథమిక పాఠశాలను బుధవారం పరిశీలించారు. ఈ పాఠశాల ప్రహరీ గోడ అంసంపూర్ణంగా ఉందనే విషయాన్ని మాజీ సర్పంచి కవురు భాస్కరరావు, సంఘ పెద్దలు, భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయుల దృష్టికి తీసుకువెళ్లారు. ఎంఎల్‌ఎ ఆదేశాల మేరకు శ్యాంసుందర్ పరిశీలకులు వచ్చారు. పాఠశాల మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్నందున త్వరలోనే ప్రహరీ గోడ నిర్మాణానికి అనుమతి ఇస్తామని తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.పుల్లారావు, సహోపాధ్యాయులు ఎం.జయలక్ష్మి ఇందుకు సంబంధించిన వివరాలు ఆయనకు తెలియజేశారు.

అన్నక్యాంటీన్ ఖర్చుపై నిలదీత

నరసాపురం : నరసాపురం స్టీమర్ రోడ్‌లో ఏర్పాటు చేసిన అన్నాక్యాంటీన్ ఖర్చుపై స్వతంత్ర కౌన్సిల్ కోటిపల్లి సురేష్ నిలదీశారు. టిడిపి ప్రభుత్వ హయంలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను పూర్తిగా ధ్వంసం చేసి పోలీస్‌స్టేషన్‌కు కేటాయించారు. మళ్లీ ఇప్పుడు లక్షలు వెచ్చించారు. ఈ ఖర్చు పురపాలక సంఘానికి భారం కాదా అంటూ 7వ వార్డు కౌన్సిలర్ సురేష్ మండిపడ్డారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం ఛైర్‌పర్సన్ వెంకటరమణ ఆధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కౌన్సిలర్ సురేష్ మాట్లాడుతూ ప్రస్తుతం టౌన్ పోలీస్ స్టేషన్ మున్సిపాలిటీది ఆ భవనానికి ఎందుకు అద్దె వసూలు చేయడం లేదంటూ ప్రశ్నించారు. కాటన్ పార్క్‌లో సీసీ కెమెరాలు, మరుగుదొడ్లు ఏర్పాటుచేయాలని కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. ఇన్‌ఛార్జి కమిషనర్, డిఇ రమేష్ బాబు, ఎఇ మణి, సునిల్ పాల్గొన్నారు.

డిఎస్‌పిగా మురళీకృష్ణ

నరసాపురం: నరసాపురం సబ్ డివిజన్ పోలీస్ అధికారిగా నాదెళ్ల బాలాజీ మారుతి మురళికృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన జి.శ్రీనివాస్ డిటిసి మచిలీపట్నంకు బదిలీ అయ్యారు. మురళీకృష్ణ విజయనగరం 5వ బెటాలియన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈయన 1989లో ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పెంటపాడు, ఉండి, పెదవేగి స్టేషన్‌లో పనిచేశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మురళీకృష్ణ మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో ఏ ఒక్కరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగే విధంగా ప్రవర్తిస్తే చట్టపరమైన, కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

CHANGE OF NAME

I Alla Harisha , W/o Alla Satish Chowdary , and Residing at D.No: 10-142, Alla Murali Krishna Road, Vatluru (V) , Pedapadu (M) Eluru Dt, A.p. Changing My Name from Alla Hareesha (Old Name) to **Alla Harisha** (New Name) Hence forth I am Being Called as **Alla Harisha** (New Name) For All Purposes

కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్
CanFinHomes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS ◆ DEPOSITS Translating Dreams into Reality
25-13-4/1, 1వ అంతస్తు, ఎన్.ఆర్. ప్లాజా, మోర్ సూపర్ మార్కెట్ రోడ్డు, నరసింహారావుపేట, ఏలూరు - 534006. ఏలూరు జిల్లా, ఎపి.
Tel: 08812-245245,76250 79240. Email : eluru@canfinhomes.com

అమ్మకం నోటీసు

రూల్ 8 (6) క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002

టూ,
1) శ్రీ / శ్రీమతి కింజంగి వెంకట నాగరాజు (ఋణగ్రహిత) హెచ్.నెం. 4-29, బిడి కాలనీ, మసీదు దగ్గర, ఏలూరు మండలం, తంగెళ్ళమూడి, ఏలూరు జిల్లా, ఎపి - 534006. **2) శ్రీమతి కంజంగి లలిత** (సహ ఋణగ్రహీత) హెచ్.నెం. 4-29, బిడి కాలనీ, మసీదు దగ్గర, ఏలూరు మండలం, తంగెళ్ళమూడి, ఏలూరు జిల్లా, ఎపి - 534006. **3) శ్రీ పలకలూరి గోవిందె** (హామీదారు) హెచ్.నెం. 9.305/2, గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర, గాంధీనగర్, నూజివీడు, కృష్ణా జిల్లా, ఎపి - 521201
మీలో నెం.1 & 2 మాబ్రాంచి నుండి **మీలో నెం. 2**కి చెందిన క్రింది ఆస్తికి సంబంధించిన తనఖా భద్రతకు వ్యతిరేకంగా హౌసింగ్‌లోన్ ను పొందారు. ఖాతా ది. 29-06-2024న ఎన్.పి.ఎ. గా వర్గీకరించబడింది మరియు ఆ తర్వాత ది. 04-07-2024 నాటి డిమాండ్ నోటీసు ద్వారా బకాయి ఉన్న మొత్తాన్ని చెల్లించాల్సిందిగా మిమ్మల్ని పిలిచారు.

తనఖా ఉంచిన స్థిరాస్తి వివరములు :

ఎ.పి. - 534005, ఏలూరు, ప్రస్తుతం ఏలూరు జిల్లా, ఏలూరు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, డి.నెం. 24ఎ-6-15/1, టి.ఎస్.నెం. 5, అశోక్‌నగర్, డబ్ల్యూ.పి. వార్డు, పాత 20వ వార్డు, ప్రజెంట్ డివిజన్ నందు 64-4-0 చ॥గ॥ల విస్తీర్ణంలోని భూమి. **హద్దులు : ఉత్తరం :** మున్సిపల్ రోడ్డు, **దక్షిణం :** సెయింట్ ఆల్ఫాన్స్ లిటిల్ సిస్టర్స్ బిల్డింగ్, **తూర్పు :** శన్యం, **పడమర :** మున్సిపల్ రోడ్డు.

సదరు మొత్తం బ్యాంక్‌కు చెల్లించడంలో విఫలమైనారు. కావున బ్యాంక్ యొక్క అధీకృత అధికారి దిగువ వివరించిన ఆస్తిని సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (4) రూల్ 8 క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 ప్రకారం స్వాధీనం చేసుకోవడం జరిగినది.

బ్యాంక్ వారు దిగువ ఆస్తిని అమ్మి తమకు రావలసిన మొత్తం **ది. 04-07-2023 నాటికి రూ. 21,06,308/-** మరియు సదరు మొత్తముపై వడ్డీ, ఇతర ఖర్చులు మరియు ఛార్జీలతో సహా రాబట్టుకొనెదరు. స్వాధీనత నోటీసును రిజిస్టర్ పోస్టు ద్వారా ఋణగ్రహీతల చివరి చిరునామాకు పంపడం జరిగినది. నోటీసు ధృవీకరించబడలేదు. కావున ఈ పత్రిక ప్రకటన ప్రచురించబడుతుంది.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 8 (6) క్రింది ఇదే చివరి నోటీసుగా పరిగణించబడుతుంది. ఈ నోటీసు తేది నుండి 30 రోజుల వ్యవధిలో మొత్తం బకాయిని చెల్లించడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది. ఇందులో విఫలమైనచో, దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క నిబంధనల ప్రకారం బకాయిని తిరిగి రాబట్టుకొనుటకు వేలం తేదిని నిర్ణయించడం, వేలం నోటీసును ప్రచురించడం మరియు స్థిరమైన సురక్షిత ఆస్తిని విక్రయించడం జరుగుతుంది.

తేది : 28-08-2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : ఏలూరు కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్
CanFinHomes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS ◆ DEPOSITS Translating Dreams into Reality
25-13-4/1, 1వ అంతస్తు, ఎన్.ఆర్. ప్లాజా, మోర్ సూపర్ మార్కెట్ రోడ్డు, నరసింహారావుపేట, ఏలూరు - 534006. ఏలూరు జిల్లా, ఎపి.
Tel: 08812-245245,76250 79240. Email : eluru@canfinhomes.com

అమ్మకం నోటీసు

రూల్ 8 (6) క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002

టూ,
1) పలివెల కమల (లేటు) గారికి చెందిన చట్టపమైన వారసులు అందరు, భర్త : పలివెల ఏసుపాదం (లేటు), డోర్ నెం. 4-58, రామేశ్వరం రోడ్డు, జుట్టిగ, పెనుమంత్ర గ్రామం & మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఎపి, ఇండియా - 534124. **2) శ్రీ పలివెల నరేంద్రబాబు,** తండ్రి : పలివెల ఏసుపాదం (లేటు), డోర్ నెం. 4-58, రామేశ్వరం రోడ్డు, జుట్టిగ, పెనుమంత్ర గ్రామం & మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఎపి, ఇండియా - 534124. **3) కోపూరి లక్ష్మి** (హామీదారు) భర్త : సూర్యారావు, డోర్ నెం. 1-138/2, జిన్నూరు, పోడూరు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఎపి, ఇండియా - 534265.
మీలో నెం.1 & 2 మాబ్రాంచి నుండి **మీలో నెం. 1**కి చెందిన క్రింది ఆస్తికి సంబంధించిన తనఖా భద్రతకు వ్యతిరేకంగా హౌసింగ్‌లోన్ ను పొందారు. ఖాతా ది. 29-06-2024న ఎన్.పి.ఎ. గా వర్గీకరించబడింది మరియు ఆ తర్వాత ది. 04-07-2024 నాటి డిమాండ్ నోటీసు ద్వారా బకాయి ఉన్న మొత్తాన్ని చెల్లించాల్సిందిగా మిమ్మల్ని పిలిచారు.

తనఖా ఉంచిన స్థిరాస్తి వివరములు :

ఎ.పి. - 534124, పశ్చిమ గోదావరి జిల్లా, పశ్చిమ గోదావరి రిజిస్ట్రేషన్ జిల్లా, అత్తిలి సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, పెనుమంత్ర మండలం, జుట్టిగ గ్రామం, రామేశ్వరంరోడ్డు, నల్లిమిల్లి వెంకటరెడ్డి కాలనీ, ఆర్.ఎస్.నెం. 32, ప్లాట్ నెం. 38, డి.నెం. 4-21 వద్ద 96.56 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఆస్తి. **హద్దులు : ఉత్తరం :** రోడ్డు, **దక్షిణం :** రోడ్డు, **తూర్పు :** కొవ్వూరి పెద సోమిరెడ్డి గారి స్థలము, **పడమర :** ప్లాట్ నెం. 37 స్థలము.

సదరు మొత్తం బ్యాంక్‌కు చెల్లించడంలో విఫలమైనారు. కావున బ్యాంక్ యొక్క అధీకృత అధికారి దిగువ వివరించిన ఆస్తిని సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (4) రూల్ 8 క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 ప్రకారం స్వాధీనం చేసుకోవడం జరిగినది.

బ్యాంక్ వారు దిగువ ఆస్తిని అమ్మి తమకు రావలసిన మొత్తం **ది. 04-07-2023 నాటికి రూ. 10,35,418/-** మరియు సదరు మొత్తముపై వడ్డీ, ఇతర ఖర్చులు మరియు ఛార్జీలతో సహా రాబట్టుకొనెదరు. స్వాధీనత నోటీసును రిజిస్టర్ పోస్టు ద్వారా ఋణగ్రహీతల చివరి చిరునామాకు పంపడం జరిగినది. నోటీసు ధృవీకరించబడలేదు. కావున ఈ పత్రిక ప్రకటన ప్రచురించబడుతుంది.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 8 (6) క్రింది ఇదే చివరి నోటీసుగా పరిగణించబడుతుంది. ఈ నోటీసు తేది నుండి 30 రోజుల వ్యవధిలో మొత్తం బకాయిని చెల్లించడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది. ఇందులో విఫలమైనచో, దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క నిబంధనల ప్రకారం బకాయిని తిరిగి రాబట్టుకొనుటకు వేలం తేదిని నిర్ణయించడం, వేలం నోటీసును ప్రచురించడం మరియు స్థిరమైన సురక్షిత ఆస్తిని విక్రయించడం జరుగుతుంది.

తేది : 28-08-2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : ఏలూరు కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్